


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




బుధవారం 29-07-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :41 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## జపాన్‌ను కుదిపిన భూకంపం


2 లో

- రిక్టర్‌పై 7.1 తీవ్రత నమోదు
- సునామీ హెచ్చరికలు జారీ
- తీరప్రాంతాల్లో ఎమర్జెన్సీ అలర్ట్
- ప్రజలు భవనాల నుంచి పరుగులు
- క్యూషూ ద్వీపంలో భూకంప కేంద్రం

## 45 రోజుల మహా ప్రచారం

- ఇంటింటికీ టీడీపీ చేరువ
- చంద్రబాబు పాలన ప్రచారం
- లోకేష్ పిలుపుతో జోరు
- ప్రజలతో నేరుగా మమేకం
- సంక్షేమమే ప్రధాన అజెండా
- ప్రజాభిప్రాయాల సేకరణ



2 లో

**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,:** సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా రెండేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ కీలక నిర్ణయం తీసుకుంది. సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున 45 రోజుల 'ఇంటింటి ప్రచార కార్యక్రమం' ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ఇచ్చిన పిలుపుతో పార్టీ శ్రేణులు, నాయకులు అత్యంత ఉత్సాహంగా ఈ ప్రచారంలో పాల్గొంటున్నారు. గ్రామాలు, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతంలోనూ ప్రజా ప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళుతూ వారితో మమేకమవుతున్నారు.

ఈ మహా ప్రజా కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో పాటు వివిధ స్థాయిల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, లక్షలాది మంది కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పాల్గొంటున్నారు. గత రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు, అందించిన సుపరిపాలన విజయాలను

## మెగా కాదు.. దగా డీఎస్సీ

- లోకేష్‌కు పేర్నినాని ఛాలెంజ్
- డీఎస్సీపై ముఖాముఖి చర్చకు సవాల్
- లోకేష్ రాజీనామా చేయాలన్న డిమాండ్
- అక్రమాలపై వైసీపీ మరో దాడి
- చంద్రబాబు, లోకేష్‌పై ఘాటు విమర్శలు

2 లో

## ఎన్డీఏ వ్యూహాత్మక భేటీ

- మోడీ కీలక దిశానిర్దేశం
- పార్లమెంట్ వ్యూహాలపై చర్చ
- ప్రతిపక్షాలకు చెక్ ప్లాన్
- యాంటీ లీక్ బిల్లుపై ఫోకస్
- కూటమి ఎంపీల సమాలోచన


2 లో

**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఎన్డీఏ పార్లమెంటరీ సమావేశం జరిగింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన పార్లమెంట్ లైబ్రరీ భవనంలో జరిగిన ఈ సమావేశానికి ఎన్డీయేలోని అన్ని పార్టీల ఎంపీలతో పాటు టీఎంసీ రెబల్ ఎంపీలు 20 మంది కూడా పాల్గొన్నారు. ఇదిలా ఉంటే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తర్వాత ఎన్డీఏ కూటమి సభ్యులు సమావేశం అవ్వడం ఇది రెండోసారి. గత మంగళవారం 'మంగళ్ మిలాన్' పేరుతో తొలిసారిగా సమావేశమైన నాయకులు, ప్రతిపక్షాల వ్యూహాలను తిప్పికొట్టేందుకు, సభలో అనుసరించాల్సిన విధానాలపై చర్చించిన విషయం తెలిసిందే.

## హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాల బీభత్సం

- ఏడు జిల్లాలకు వరద హెచ్చరికలు
- కొండచరియలతో తీవ్ర నష్టం
- 108 రహదారులు మూతపడ్డాయి
- సిమ్లా సహా పలు జిల్లాల్లో అలర్ట్
- జులై 30 వరకు ఆరెంజ్ వార్నింగ్
- ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి

2 లో

## పోలీసుల కాల్పులతో 14 మృతి

- రావాలాకోట్ రక్తపాతంతో ఉలిక్కిపాటు
- పాక్ బలగాలపై తీవ్ర విమర్శలు
- యువతపై కాల్పుల కలకలం
- ప్రపంచ దృష్టి రావాలాకోట్ వైపు
- పాక్ చర్యలపై ఆగ్రహ జ్వాలలు
- అంతర్జాతీయ జోక్యానికి డిమాండ్

2 లో





# ఆస్తులు..కేసులు.. దేశవ్యాప్త చర్చ

- 89 కేసులతో రేవంత్ టాప్
- సీఎంల ఆస్తులపై ఏడీఆర్ రిపోర్టు
- సంపన్న సీఎంగా డీకే శివకుమార్
- రూ.931 కోట్లతో చంద్రబాబు రెండో స్థానం
- దక్షిణాది సీఎంలదే టాప్-3
- 14 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు
- రేవంత్‌కు 89.. డీకే, బాబుకు 19
- అఫిడవిట్ల ఆధారంగానే ఏడీఆర్ నివేదిక
- ఆస్తులు, కేసులతో దేశవ్యాప్తంగా చర్చ

**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** దేశంలోని ముఖ్యమంత్రుల ఆస్తులు, క్రిమినల్ కేసులు, విద్యార్హతలు, వయస్సు వంటి వివరాలపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన తాజా నివేదిక దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా రూపొందించిన ఈ రిపోర్టులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యధికంగా 89 క్రిమినల్ కేసులు ప్రకటించిన ముఖ్యమంత్రిగా నిలిచారు. ఇక సంపన్న ముఖ్యమంత్రుల జాబితాలో దక్షిణాది రాష్ట్రాల నుంచే తొలి 3 స్థానాల్లో సీఎంలు నిలిచారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తొలి స్థానాన్ని దక్కించుకోగా.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండో స్థానంలో నిలిచారు.

## కృష్ణా పరవళ్లు.. శ్రీశైలానికి భారీ ఇన్‌ఫ్లో!

- జూరాల గేట్లు ఎత్తివేత
- ఎగువన భారీ వర్షాలు
- భీమా నది ఉద్ధృతి
- శ్రీశైలానికి భారీ ఇన్‌ఫ్లో
- అధికారుల వరద హెచ్చరిక


2 లో

**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** తెలుగు రాష్ట్రాలపై ఎల్ నినో ప్రభావం అధికంగా ఉన్నప్పటికీ.. కృష్ణా నది ఎగువన ఉన్న రాష్ట్రాల్లో మాత్రం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. అలాగే గత వారం రోజులుగా ఈ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తుతోంది.

## అరెస్టులపై కోర్టు కీలక ఆదేశాలు

- విద్యార్థులకు సుప్రీంకోర్టు ఊరట
- రాష్ట్రాలకు నోటీసులు జారీ
- సిట్ ఏర్పాటుకు సూచన
- పోలీసు దౌర్జన్యాలపై ఆగ్రహం


2 లో

**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** దేశవ్యాప్తంగా పరీక్షల లీకేజీలు, అక్రమాలకు నిరసనగా జూలై 20 నుంచి విద్యార్థులు చేపట్టిన ఆందోళనల్లో అరెస్ట్ అయిన విద్యార్థులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకుని కేంద్రం ఆయా రాష్ట్రాలు వారిని వెంటనే విడుదల చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నేర చరిత్ర లేని, నిరసనల్లో పాల్గొని అరెస్ట్ లేదా నిర్బంధంలో ఉన్న విద్యార్థులందరినీ వెంటనే విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది.

## మావోయిస్టులకు భారీ షాక్

- ఒక్కరోజే 16 మంది సరెండర్
- రివార్డు నేతలూ లొంగుబాటు
- హింసను వీడి జనజీవనంలోకి


2 లో

## కొత్త యూనిఫామ్‌లకు గ్రీన్‌సిగ్నల్


2 లో

- 27 లక్షల మందికి రెండు జతల దుస్తులు
- ఆగస్టు 15న తొలి విడత పంపిణీ
- 6వ తరగతి నుంచే ప్యాంట్ల పంపిణీ
- బూట్లు, సాక్సులు, టై, బెల్ట్ ఉచితం
- గురుకులాలకు ప్రత్యేక యూనిఫామ్
- సర్కారీ బడులకు కార్పొరేట్ లుక్

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 29-07-2026

# మెగా కాదు.. దగా డీఎస్సీ

**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** మంత్రి నారాలోకేష్ కు మాజీ మంత్రి పేర్నినాని సవాల్ విసిరారు. చంద్రబాబు చర్చకు వస్తే జగన్ మోహన్ రెడ్డి వస్తారని అన్నారు. లోకేష్ చర్చకు వస్తే తానే వెళతానని చెప్పారు.



విద్యాశాఖ మినహా అన్ని శాఖల్లో లోకేష్ వేలు పెడుతున్నాడని విమర్శించారు. చీమ చిటుక్కుమన్నా తనవల్లే అంటాడని, సత్తా ఉంటే డీఎస్సీ అక్రమాలపై తనతో చర్చకు రావాలని సవాల్ చేశారు. పవిత్రమైన టీచర్ ఉద్యోగాల్లో పాపాలు చేశారని ఆరోపించారు. మీలో నిజాయితీ ఉంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రి పదవి కోసమే బోండా ఉమా ముచ్చట పడుతున్నారు కదా అంటూ ఎద్దేవా చేశారు. మీరు రాజీనామా చేసి ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని సూచించారు. ఇది మెగా డీఎస్సీ కాదని దగా డీఎస్సీ అని వ్యాఖ్యానించారు. డీఎస్సీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని, మంత్రి నారాలోకేష్ రాజీనామా చేసేంతవరకు పోటారం కొనసాగుతుందని స్పష్టం చేశారు. డీఎస్సీ అక్రమాలపై విచారణకు తాము సిద్ధం అని స్పష్టం చేశారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుతున్నారంటూ మండిపడ్డారు. చంద్రబాబు తన భజన పత్రికల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు.

# మావోయిస్టులకు భారీ షాక్



**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** ఝార్ఖండ్ రాజధాని రాంచీలో మావోయిస్టుల నెట్‌వర్క్‌కు తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. హింసామార్గాన్ని వీడి ప్రజాస్వామ్య వ్యవస్థ పై నమ్మకంతో ఏకంగా 16 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాలకు ఆకర్షితులై, భద్రతా బలగాలు చేపట్టిన నిరంతర నిఘా, వ్యూహాత్మక చర్యల ఫలితంగానే వీరు జనజీవన స్రవంతి లోకి వచ్చినట్లు పోలీసులు స్పష్టం చేశారు.

లొంగిపోయిన వారిలో ఆరుగురు అత్యంత కీలక నేతలు కాగా, వీరిపై ప్రభుత్వం రూ. 39 లక్షల మొత్తంలో భారీ రివార్డులను ప్రకటించి ఉంది. తీవ్రమైన విచారణలు, అనేక హింసాత్మక ఘటనలలో వీరికి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లొంగిపోయిన మావోయిస్టులందరికీ తగిన పునరావాస సదుపాయాలు, ఆర్థిక సహాయం అందిస్తామని, శాంతియుత జీవనం సాగించేందుకు పూర్తి సహకారం ఉంటామని పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

ఐజీ (ఆపరేషన్స్), జార్ఖండ్ పోలీస్ నరేంద్ర కుమార్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎనిమిది మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో రూ.15 లక్షల రివార్డు ఉన్న ఒక కేంద్ర కమిటీ సభ్యుడు కూడా ఉన్నాడు. మిగిలిన వారిలో ముగ్గురు జోనల్ కమిటీ సభ్యులు, ముగ్గురు సబ్–జోనల్ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. ఇది జార్ఖండ్ పోలీసులకు ఒక చారిత్రాత్మక దినం, గొప్ప విజయం. మావోయిస్టు కార్యకలాపాలు దాదాపుగా నిర్మూలించబడ్డాయి. కొందరు ఇంకా చురుకుగా ఉన్నారు. వారిపై నిరంతర ఆపరేషన్లు కొనసాగుతున్నాయి. వారు వీలైనంత త్వరగా లొంగిపోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. లేకపోతే, ఆపరేషన్ల సమయంలో వారిని హతమార్చడం జరుగుతుంది." అని మీడియాకు చెప్పుకొచ్చారు.

# అరెస్టులపై కోర్టు కీలక ఆదేశాలు

నేర చరిత్ర లేని విద్యార్థులపై ఎలాంటి బలవంతపు లేదా కఠిన చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేసింది.

రాష్ట్రాలకు నోటీసులు:

సీజేపీ చేపట్టిన ఆందోళనల్లో చెలరేగిన హింస, పోలీసుల దౌర్జన్యాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనలపై పారదర్శకంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అధ్యక్షతన 'ప్రత్యేక విచారణ బృందం' (సిట్) ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు అత్యున్నత న్యాయస్థానం సూచించింది. ఈ వ్యవహారంపై స్పందించాలని కేంద్రంతో పాటు ఢిల్లీ ప్రభుత్వం, తెలంగాణ సహా అస్సాం, బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్లపై మంగళవారం సమగ్ర విచారణ చేపట్టింది.

నిరసనల్లో నేరస్తులు:

మరోవైపు కేంద్రం తరపున వాదనలు వినిపించిన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నిరసకారుల్లో 101 మందికి నేర చరిత్ర ఉందని, 62 మందిపై హత్యాయత్నం కేసులు ఉన్నట్లు గుర్తించామని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈఘటనల్లో దాదాపు 250 మందికి పైగా పోలీసులకు కూడా గాయాలయ్యాయని, విద్యార్థుల నిరసనల్లోకి అసాంఘిక శక్తులు చొరబడి హింసను ప్రేరేపించి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు.

# పోలీసుల కాల్పులతో 14 మృతి




**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని రావాలాకోట్‌లో సోమవారం రాత్రి తర్వాత చోటుచేసుకున్న ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నిరసన తెలుపుతున్న యువతపై పాకిస్థాన్ పోలీసులు, భద్రతా బలగాలు జరిపిన అంధాధుంద్ కాల్పుల్లో దాదాపు 14 మంది యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని ప్రత్యక్ష సాక్షులు, స్థానిక నాయకులు తెలిపారు. నిర్దాక్షిణ్యంగా జరిగిన ఈ కాల్పుల ఘటనతో ప్రాంతంలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఘటనపై జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ కోర్ మెంబర్ ఇంతియాజ్ అస్లాం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ బలగాలు అమాయక యువతపై కాల్పులు జరిపి పొట్టనబెట్టుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశాల్లో ఉన్న కశ్మీరీలందరూ వెంటనే స్పందించి పాకిస్థాన్ ఎంబసీలు, ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థల కార్యాలయాల ఎదుట భారీ ఎత్తున నిరసనలు తెలుపాలని, పాక్ బలగాల అరాచకాలను ప్రపంచానికి చాటి చెప్పాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

# 45 రోజుల మహా ప్రచారం

ప్రతి కుటుంబానికి ప్రత్యక్షంగా వివరిస్తున్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పిస్తూ, వారి నుంచి విశేష స్పందనను రాబడుతున్నారు.


ఈ పర్యటనల ద్వారా ప్రజా ప్రతినిధులు కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా, ప్రజల అభిప్రాయాలు, సూచనలు, స్థానిక సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుంటున్నారు. ప్రభుత్వం, ప్రజల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దారు. ప్రతి ఇంటినీ పలకరించి, వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తూ ముందుకు సాగుతున్న ఈ ప్రచార కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి అపారమైన మద్దతు, హర్షం వ్యక్తమవుతున్నాయి.

# పార్లమెంట్ వ్యూహాలపై ఎన్డీఏ భేటీ

**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఎన్డీఏ పార్లమెంటరీ సమావేశం జరిగింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన పార్లమెంట్ లైబ్రరీ భవనంలో జరిగిన ఈ సమావేశానికి ఎన్డీయేలోని అన్ని పార్టీల ఎంపీలతో పాటు టీఎంసీ రెబల్ ఎంపీలు 20 మంది కూడా పాల్గొన్నారు. ఇదిలా ఉంటే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తర్వాత ఎన్డీఏ కూటమి సభ్యులు సమావేశం అవ్వడం ఇది రెండోసారి. గత మంగళవారం 'మంగళ్ మిలాన్' పేరుతో తొలిసారిగా సమావేశమైన నాయకులు, ప్రతిపక్షాల వ్యూహాలను తిప్పికొట్టేందుకు, సభలో అనుసరించాల్సిన విధానాలపై చర్చించిన విషయం తెలిసిందే.

ఈ సమావేశంలో ప్రధానంగా ఇటీవల దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, యువత చేపడుతున్న ఆందోళనలు, ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలపై విస్తృతంగా చర్చించారు. దీంతో పాటు పార్లమెంట్‌లో బిల్లుల ఆమోదం, సభ సాఫీగా సాగేందుకు అధికార కూటమి ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోడీ దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తుంది. అలాగే యాంటీ పేపర్ లీక్ బిల్లుపై సభలో చర్చ జరగనున్న క్రమంలో ఎన్డీయే పక్ష నేతలు సమావేశం కావడం తీవ్ర ప్రాముఖ్యతను సంతరించుకుంది. కాగా ఈ భేటీకి కేంద్ర మంత్రులు, బీజేపీ సహా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంట్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# జపాన్‌ను కుదిపిన భూకంపం



**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. దక్షిణ ప్రాంతమైన క్యూషూ ద్వీపంలో ఉన్న కుమమోటో ప్రిఫెక్చర్‌లో మంగళవారం సాయంత్రం ఈ భూకంపం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై దీని 7.1గా నమోదైనట్లు జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించింది. భూమికి దాదాపు 10 కిలోమీటర్ల లోతులో కేంద్రీకృతమైన ఈ భూ ప్రకంపనల తీవ్రతకు ఇళ్లు, ఆఫీసుల్లోని వస్తువులు విపరీతంగా ఊగిపోయాయి. దీంతో ఒక్కసారిగా భయాందోళనకు గురైన ప్రజలు ప్రాణాలు దక్కించుకోవడానికి నివాసాలు, భవనాల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు.

భూకంపం ధాటికి సముద్ర మట్టంలో మార్పులు సంభవించే అవకాశం ఉండటంతో అధికారులు తీరప్రాంత ప్రజలకు 1 మీటరు (3 అడుగులు) ఎత్తున అలలు ఎగసి పడే అవకాశం ఉందంటూ సునామీ హెచ్చరికలు జారీ చేశారు. కుమమోటో, నాగసాకి, కాగోషిమా, ఫుకుఓకా సహా పలు ప్రాంతాల్లో ఎమర్జెన్సీ అలర్ట్‌లను యాక్టివేట్ చేశారు. ప్రస్తుతం సహాయక బృందాలు క్షేత్రస్థాయిలో ఆస్తి, ప్రాణ నష్టం వివరాలను సేకరిస్తున్నాయి.

# కృష్ణా పరవళ్లు.. శ్రీశైలానికి భారీ ఇన్‌ఫ్లో!

మొదటి పేజీ తరువాయి

దీంతో ప్రాజెక్టు గేట్లు తెరిచిన అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 32,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అంతే స్థాయిలో ప్రాజెక్టు నుంచి 30,700 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జూరాల నుంచి ప్రవాహం క్రమంగా పెరుగుతుండడంతో దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

కాగా, కర్ణాటకలోని భీమా నది పరివాహక ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక పశ్చిమ కనుమల్లో (ఘాట్ ప్రాంతాల్లో) భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో కృష్ణానదికి వరద మరింత పెరిగే అవకాశం ఉంది. భీమా నది నుంచి అదనపు ప్రవాహాలు జూరాలలో కలిసే అవకాశం ఉండటంతో నీటిమట్టం మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి వల్ల శ్రీశైలం జలాశయ నీటిమట్టం వేగంగా పెరిగి, రాబోయే రోజుల్లో శ్రీశైలానికి మరింత భారీగా ఇన్‌ఫ్లోలు నమోదవుతాయని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

# కొత్త యూనిఫామ్‌లకు గ్రీన్‌సిగ్నల్



**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కు ఇచ్చే యూనిఫామ్స్ పై సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. అధికారులతో జరిగిన సమావేశం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కొత్త యూనిఫామ్‌లను ఖరారు చేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బాలుర షర్టులు, బాలికల టాప్‌లను లైట్ బ్లూ రంగులో, బాలుర ప్యాంట్లు, బాలికల బాటమ్స్‌ను ముదురు నీలం (డార్క్ బ్లూ) రంగులో నిర్ణయించారు. ఇక గురుకుల పాఠశాల పిల్లలకు మెరూన్ చెక్స్ ఉన్న టాప్స్, ప్లెయిన్ మెరూన్ లోవర్లను ఖరారు చేశారు. ఈసారి ప్రాథమిక స్థాయి మార్పుగా 6వ తరగతి నుంచే బాలురకు నిక్కర్లకు బదులుగా ప్యాంట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 27 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున ఈ కొత్త యూనిఫామ్‌లను అందించనున్నారు. ఇందులో మొదటి జత దుస్తులను ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దుస్తులతో పాటు విద్యార్థులందరికీ బూట్లు, సాక్సులు, టై, బెల్ట్‌ను కూడా సర్కారు ఉచితంగా అందజేయనుంది. ఈ నిర్ణయంతో సర్కారీ బడుల్లో చదివే పిల్లలకు సరికొత్త కార్పొరేట్ లుక్ రానున్నట్లు తెలుస్తోంది.

# హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాల బీభత్సం



**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** హిమాచల్ ప్రదేశ్‌లో కుండపోత వర్షాలు విపరీతంగా ముంచెత్తుతున్నాయి. రాజధాని సిమ్లా సహా పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు అనేక చోట్ల కొండచరియలు విరిగిపడి తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా చంబా జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో సుమారు డజనుకు పైగా వాహనాలతో పాటు పలు ఇళ్లు మట్టి దిబ్బల కింద చిక్కుకుపోయాయి. వర్షాలు, వరదల ధాటికి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 108 రహదారులు మూతపడగా, 38 తాగునీటి సరఫరా పథకాలు, 9 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నిలిచిపోయినట్లు రాష్ట్ర ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ వెల్లడించింది. అలాగే ఆకస్మిక వరదల కారణంగా వందలాది వాహనాలు వరదలో చిక్కుకొని పోయాయి.

రాబోయే 24 గంటల్లో రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ఏడు జిల్లాలకు (చంబా, కాంగ్రా, కులు, మండి, సిమ్లా, సిర్మోర్, సోలన్) ఫ్లాష్ ఫ్లడ్ (దిశ మార్చుకునే హఠాత్ వరద) ముప్పు ఉందని వాతావరణ శాఖ మంగళవారం వెల్లడించింది. పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జులై 30 వరకు, అలాగే ఆగస్టు 3న ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. కొండ ప్రాంతాల ప్రజలు, పర్యాటకులు వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని, సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని పరిపాలనా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# ఆస్తులు.. కేసులు.. దేశవ్యాప్త చర్చ

ఏడీఆర్ రిపోర్టు ప్రకారం దేశంలోని 28 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన మొత్తం 31 మంది ముఖ్యమంత్రుల ప్రకటిత ఆస్తుల మొత్తం విలువ రూ.3,660 కోట్లుగా ఉంది. ఇందులో ఒక్క కర్ణాటక సీఎం డీకే శివకుమార్ రూ.1,413 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు రూ.931 కోట్లతో రెండో స్థానంలో.. తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ రూ.648 కోట్లతో మూడో స్థానంలో నిలిచారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రూ.30 కోట్లకు పైగా ప్రకటిత ఆస్తులతో 8వ స్థానంలో ఉన్నారు.




అతి తక్కువ ఆస్తులు ప్రకటించిన ముఖ్యమంత్రుల జాబితాలో జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా రూ.55 లక్షలతో తొలి స్థానంలో ఉండగా.. పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి రూ.85 లక్షలతో రెండో స్థానంలో.. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ సుమారు రూ.1 కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో నిలిచారు. ఈ నివేదికలో ఎక్కువ చర్చకు దారితీసిన అంశం ముఖ్యమంత్రులపై నమోదైన క్రిమినల్ కేసులే. మొత్తం 31 మంది సీఎంలలో 14 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఏడీఆర్ వెల్లడించింది.

ఇందులో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి 89 కేసులతో అగ్రస్థానంలో నిలిచారు. రేవంత్ రెడ్డి తర్వాత పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారిపై 29 కేసులు ఉన్నాయి. కర్ణాటక సీఎం డీకే శివకుమార్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుపై చెరో 19 కేసులు నమోదైనట్లు ఈ నివేదిక పేర్కొంది. ఇద్దరు ముఖ్యమంత్రులపై హత్యాయత్నానికి సంబంధించిన కేసులు కూడా ఉన్నట్లు ఏడీఆర్ వెల్లడించింది.

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించండి.. సీఎస్‌కు హైకోర్టు ఆదేశాలు

ఎన్నికల అఫిడవిట్ ప్రకారం రేవంత్ రెడ్డి ప్రకటించిన 89 కేసుల్లో ఎక్కువగా రాజకీయ నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, ఎన్నికల ప్రచారాల సమయంలో నమోదైనవేనని వివరాలు సూచిస్తున్నాయి. ఈ కేసుల్లో చాలా వరకు ప్రస్తుతం వివిధ కోర్టుల్లో విచారణ దశలో ఉన్నాయి. కేసులు నమోదై ఉండటం మాత్రమే నేరం రుజువైనట్లు కాదని.. ఇవన్నీ అభ్యర్థులు ఎన్నికల అఫిడవిట్లలో స్వయంగా ప్రకటించిన వివరాలేనని ఏడీఆర్ తెలిపింది.

వయస్సు పరంగా చూస్తే 31 మంది ముఖ్యమంత్రుల్లో 17 మంది సీఎంలు.. 51 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారు ఉన్నారని.. మరో 8 మంది 41 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్నారని ఈ నివేదిక తెలిపింది. మొత్తంగా చూస్తే సంపన్న ముఖ్యమంత్రుల జాబితాలో దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు తొలి మూడు స్థానాలను కైవసం చేసుకోగా.. క్రిమినల్ కేసుల సంఖ్యలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అగ్రస్థానంలో నిలవడం ఈ ఏడీఆర్ నివేదికలో ప్రధానంగా చర్చకు కారణమైంది.

# రెండున్నర లక్షల కొత్త చేయూత ఫించన్లు.. ముహూర్తం ఫిక్స్, ముందుగా వారికి ప్రాధాన్యం



**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** తెలంగాణలో సంక్షేమ పథకాల పారదర్శక అమలే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. చేయూత పెన్షన్ పథకం లబ్ధిదారులకు సంబంధించి గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న లైవ్ అథెంటిఫికేషన్ ముఖ గుర్తింపు సర్వేను ఈ నెలాఖరు నాటికి అత్యంత వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలు, సమగ్ర నివేదికను రూపొందించి ఆగస్టు 5 నాటికి ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టమైన సూచనలు జారీ చేసింది.

ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన కొత్త లబ్ధిదారులకు పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనికి ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం పింఛను పొందుతున్నవారిలో అనర్హులను, మరణించిన వారిని అలాగే నిబంధనలకు విరుద్ధంగా లబ్ధి పొందుతున్న వారిని గుర్తించి జాబితా నుంచి తొలగించాలని ఆదేశించడంతో గత మూడు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయి సర్వే సాగుతోంది.

సెర్ప్ ఇప్పటివరకు నిర్వహించిన ముఖ గుర్తింపు నమోదు సర్వేలో ప్రాథమికంగా 1,21,229 మందిని అనర్హులుగా అధికారులు గుర్తించారు. రాబోయే రోజుల్లో వీరి వివరాలను పరిశీలించి పూర్తి స్థాయి తొలగింపు చర్యలు చేపడతారు. మరోవైపు.. కొత్తగా పెన్షన్లు పొందడానికి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు పది లక్షల మందికి పైగా అర్హులైన వారు ఇప్పటికే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు.

ప్రభుత్వం చేపడుతున్న ఈ సమగ్ర తనిఖీల నేపథ్యంలో మరో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1157 మంది తమకు పెన్షన్లు వద్దంటూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి లబ్ధిదారుల జాబితా నుంచి పేర్లను తొలగించుకున్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 156 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 156 మంది తమ పెన్షన్లను వదులుకున్నారు. అలాగే ఖమ్మంలో 130 మంది, పెద్దపల్లిలో 90, మెదక్‌లో 83, సంగారెడ్డిలో 67, జగిత్యాలలో 64, రాజన్న సిరిసిల్లలో 55, సిద్దిపేటలో 44, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో చెరో 39 మంది చొప్పున తమ పింఛన్లను వదులుకోగా.. ములుగు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ పలువురు స్వచ్ఛందంగా తమ హక్కును వదులుకోవడం విశేషం.

# కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రతిపాదనలు



**న్యూస్ డెస్క్, 28 జూలై (ఇది కద నిజం,):** సీఎం రేవంత్ రెడ్డి హస్తిన పర్యటన బిజీబిజీగా సాగుతోంది. ఈ మేరకు ఇవాళ మధ్యాహ్నం ఆయన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, ఉపాధి హామీ పథకంలో కొత్త పనుల చేరిక, నివాస గృహాల నిర్మాణాలకు సంబంధించిన వివరాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి విస్తృతంగా చర్చించారు.

90 రోజుల పాటు ఉపాధి కల్పించాలి..

ఈ భేటీలో ప్రధానంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ్ 2.0 కింద తెలంగాణ రాష్ట్రానికి 11.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణలో గ్రామీణ ఇళ్ల నిర్మాణాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని, కాబట్టి ఈసారి రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన వివరించారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వీబీ–జీ రామ్–జీ జాబితాలో చేర్చి, లబ్ధిదారులకు 90 రోజుల పాటు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా ఎల్‌నినో ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వీబీ–జీ రామ్–జీ పథకంలో అదనపు పనులను చేర్చాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. రైతుల జీవనోపాధిని మెరుగుపరిచే దిశగా కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణం వంటి 10 రకాల కొత్త పనులకు అనుమతి ఇవ్వాలని సీఎం కోరారు. వీటితో పాటు రైతుల భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ భూముల పునరుద్ధరణ పనులకు కూడా ఉపాధి హామీ కింద అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను రేవంత్ రెడ్డి కోరారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్

ఇది కద నిజం, అత్తాపూర్ : అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటరు పత్రాలు అందుకున్న వారందరూ వాటిని సక్రమంగా పూరించి వెంటనే సంబంధిత బీఎల్వో లకు అందజేయాలని కోరారు. ఓటర్ల జాబితా పకడ్బందీగా తయారయ్యేందుకు ప్రజలందరూ ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ



అధ్యక్షులు సుల్గే వెంకటేష్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఓటర్ల నమోదు మరియు ఫారమ్‌ల సేకరణ ప్రక్రియను ముమ్మరం చేశామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సహాయం అందిస్తారని తెలిపారు. ఎవరికీ ఎలాంటి సందేహాలు ఉన్నా హెల్ప్‌డెస్క్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొమరయ్య, జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్, జిల్లా ఆఫీస్ సెక్రటరీ విజయ్ కుమార్, జయానంద రెడ్డి, కాకులారం కృష్ణ, జి. రాజు, శివరాజ్ గౌడ్, రాము, ప్రవీణ్ చంద్, అనిల్, గాయత్రి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నకిరేకల్ నియోజకవర్గ ఇన్చార్జిగా ఎన్నికైన సందర్భంగా మేడి నరేష్ భారీ ర్యాలీ

ఇది కద నిజం:నకిరేకల్ నియోజకవర్గ న్యూస్: తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జీగా మేడి నరేష్ ని ప్రకటించిన సందర్భంగా వందలాది మంది కార్యకర్తలతో బాణాసంచాలు కాల్చుతూ భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ క్రమంలో ర్యాలీగా బయలుదేరి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. నకిరేకల్ పట్టణ కేంద్రంలో భారీ ర్యాలీ అనంతరం నూతనంగా నియోజకవర్గ ఇన్చార్జిగా ఎన్నికైన మేడి నరేష్ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితమ్మ గారు ఇంత గొప్ప పదవి బాధ్యతలు నమ్మకంతో అప్ప చెప్పినందుకు నకిరేకల్ నియోజకవర్గ గడ్డమీద నుంచి ప్రజల పక్షాన ధన్యవాదాలు, కృతజ్ఞతలు, తెలియజేస్తూ పాదాభివందనాలు అని మాట్లాడారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ , కాంగ్రెస్ పార్టీల వల్ల , చిరుమర్తి లింగయ్య, వేముల వీరేశం వల్ల అభివృద్ధి శూన్యం అని కాంగ్రెస్ పార్టీలో వ్యక్తిగత పోటీల రాజకీయాలు జరుగుతున్నందున



వేముల వీరేశం కు కొత్తగా పదవి వచ్చినందున నకిరేకల్ నియోజకవర్గానికి మార్పు ఏమీ రాదని తెలంగాణ రక్షణ సేన పార్టీ నుంచి మేడి నరేష్ సవాల్ విసిరారు. నకిరేకల్ నియోజకవర్గ ప్రజల కోసం ప్రాణాలైనా ఇస్తానని మాట్లాడారు, ఎటువంటి ప్రలోభాలకు తలగేది లేదని తెలిపారు, నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తూ, పోరాడుతానని అన్నారు. భారీ జన సందోహంతో ర్యాలీ నిర్వహించిన కార్యకర్తలందరికీ ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.

# పిట్లం అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు..

### సెంటర్ లైటింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి: సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్

ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 28 : కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో ంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పిట్లం గ్రామ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ అధికారులను కోరారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన గ్రామ ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పిట్లం సెంటర్ లైటింగ్ పనులను వెంటనే ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం తగదని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని, అభివృద్ధి పనుల కోసం



నిరంతరం కృషి కొనసాగిస్తామని సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి సాయన్న, డిసిసిబి డైరెక్టర్ సాయి రెడ్డి మండల వివిధ శాఖల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## ముగ్గురు అక్కచెల్లెల్లతో యువకుడి పెళ్లి.. అసలు ట్విస్ట్ ఏంటంటే..!

న్యూస్ డెస్క్, 28 జూలై ఇది కద నిజం: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ముగ్గురు అక్కాచెల్లెలు ఒకే వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్లు వచ్చిన వార్త వైరల్ అయిన సంగతి తెలిసిందే. అయితే ఈ సంఘటనలో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. ఇది రియల్ పెళ్లి కాదని.. ఫ్రాంక్ వీడియో అని తేలిపోయింది. ఈ మేరకు చైల్డ్ సోషల్ వెల్ఫేర్ కమిటీ అధికారిక ప్రకటన చేసింది. ముగ్గురు అక్కాచెల్లెలు ఒకే వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్లు వీడియో వైరల్ అయిన నేపథ్యంలో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ముగ్గురు అక్కాచెల్లెళ్లలో ఒకరు మైనర్ ఉన్నారని, దీనిపై విచారణ చేసి చర్యలు



తీసుకోవాలని చైల్డ్ సోషల్ వెల్ఫేర్ కమిటీకి ఆధారాలు అప్పగించారు. అయితే దీనిపై విచారణ చేసి... అసలు బండారం బయటపెట్టింది చైల్డ్ సోషల్ వెల్ఫేర్ కమిటీ. తాము పెళ్లి చేసుకోలేదని.. పాపులారిటీ, ఫాలోవర్స్ పెంచుకునేందుకు డ్రామా ఆడినట్లు ముగ్గురు అక్కాచెల్లెలు అసలు వాస్తవాన్ని బయటపెట్టారు. ఇదే విషయాన్ని సిడబ్ల్యూసి ఛైర్మన్ కూడా మీడియాకు తెలిపారు. అంతేకాదు వ్యూస్ కోసం ఇలా చేసే వాళ్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకోవాలి

### రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్

ఇది కద నిజం, రాజేంద్రనగర్ హైదర్‌గూడలోని డోనాల్డ్ స్కూల్ శక్తి కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఎస్.ఐ.ఆర్. హెల్ప్ డెస్క్‌ను రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్ మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే అత్యంత కీలకమైన వజ్రాయుధం ఓటు హక్కు అని,




ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఓటర్లందరూ తప్పకుండా సహకరించాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు తమ ఎన్యుమరేషన్ ఫారమ్‌ను సకాలంలో నింపి ఇవ్వాలని, ఆఖరి రోజుల్లో ఇబ్బందులు పడకుండా వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఫారమ్‌లు అందని వారు తమ ఓటరు ఐడీ లేదా ఆధార్ కార్డుతో హెల్ప్‌డెస్క్‌ను సంప్రదిస్తే, తమ కార్యకర్తలు యాప్ ద్వారా పరిశీలించి సంబంధిత బీఎల్వో వివరాలు అందజేస్తారని తెలిపారు. ప్రస్తుతం ఫారమ్‌లు తిరిగి సమర్పించిన వారికి మాత్రమే ఆగస్టు 10వ తేదీ తర్వాత మార్పులు, చేర్పులు మరియు తప్పుల సవరణ చేసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా బీజేపీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి సహాయం చేస్తారని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్, రంగారెడ్డి జిల్లా ఎస్ఐఆర్ ఇంచార్జ్ నారాగూడెం మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ సెక్రటరీ, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఎస్ఐఆర్ ఇంచార్జ్, బీఎల్ఏ-1 పొన్నమోని మల్లేష్ యాదవ్, రంగారెడ్డి జిల్లా కార్యాలయ కార్యదర్శి, బీఎల్ఏ-2 సాబాద విజయ్ కుమార్, బీజేపీ క్రియాశీల సభ్యురాలు సాబాద స్వప్న, సీనియర్ నాయకులు గొరిగే రాజు, డివిజన్ ఉపాధ్యక్షురాలు పొట్ట గాయత్రి అనిల్ కుమార్, కాకులారం కృష్ణ, సాయి యాదవ్, బీఎల్ఏ నారగూడెం సోమ్‌నాథ్ రెడ్డి, తాటి రాజు, మల్లేష్ చారి, ఎల్. వెంకటేష్, కైల రవీందర్ రెడ్డి, ఎస్. భజరంగ్ రెడ్డి, డి. రాములు, సులిగే శ్రీనివాస్, మోంగ్ర అయిలయ్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు బీఎల్వోలు నిషిత ప్రభు గౌడ్, మౌనిక, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్ల చిన్నారి కిడ్నాప్.. కలకలం..!

ఆదిలాబాద్, 28 జూలై ఇది కద నిజం, : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రూయ్యడి గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి ఆత్రం గంగామణి కిడ్నాప్‌కు గురైన ఘటన కలకలం రేపింది. చిన్నారి తల్లిదండ్రులకు తెలియకుండా గ్రామానికి చెందిన నైతం నాగుబాయి ఆమెను సోమవారం మధ్యాహ్నం ఆదిలాబాద్ పట్టణానికి తీసుకొచ్చి, బస్టాండ్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులకు అప్పగించినట్లు ఆరోపణలు రావడంతో తలమడుగు పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. చిన్నారి కనిపించకపోవడంతో తల్లి ఆత్రం కప్లిబాయి



పోలీసులకు ఫిర్యాదు చేయగా, వెంటనే రూరల్ సీఐ రహీం పాషా, తలమడుగు ఎస్ఐ డి. రాధిక, రూరల్ ఎస్ఐ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ప్రారంభించారు.

ఆదిలాబాద్, తాంసి బస్టాండ్ ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా, నిందితురాలు చిన్నారితో కలిసి సంచరించిన దృశ్యాలు లభించినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి ఆత్రం గంగామణికి నాలుగేళ్ల వయస్సు ఉండగా, ఆమెకు కోలాం భాషతో పాటు కొద్దిగా తెలుగు మాట్లాడటం వస్తుందని పోలీసులు వెల్లడించారు. చిన్నారి ఆచూకీ తెలిపిన వారికి నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. చిన్నారి ఎక్కడైనా కనిపించినా లేదా ఆమెకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్, డయల్ 100 లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని డీఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. త్వరితగతిన చిన్నారిని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## వ్యవసాయ సాంకేతికత వైపు ప్రభుత్వం అడుగులు



సూర్యాపేట, 28 జూలై ఇది కద నిజం,: వ్యవసాయ సాంకేతికత వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం, హైదరాబాదు నుంచి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో, కలిసి అన్ని జిల్లాల్లోని మండలాల రైతు వేదికల ద్వారా, అధికారులు, రైతులతో రైతు నేస్తం 100వ ఎపిసోడ్ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా,మంత్రి తుమ్మల మాట్లాడుతూ, వ్యవసాయాన్ని సులభంగా, లాభసాటిగా మార్చేందుకు సాంకేతికతను వ్యవసాయ రంగానికి జోడించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు. ఉద్యానవన పంటల సాగుపై, రైతులు దృష్టి పెట్టాలన్నారు. ఆయిల్ పామ్ పంటల సాగు వల్ల అధిక లాభాలు వస్తాయని వివరించారు. నేల స్వభావం, నీటి లభ్యత, దిగుబడి, మార్కెటింగ్ సౌకర్యం, తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటలు సాగు చేయాలన్నారు. ప్రతి రైతు పంట మార్పిడి విధానాలు పాటించాలని పేర్కొన్నారు. మోతాదుకు మించి ఎరువులను వాడరాదని తెలిపారు.రైతు నేస్తం కార్యక్రమం ద్వారా,ప్రపంచ సమాచారాన్ని మొత్తం రైతు ముంగిట్లో ఉంచుతున్నామన్నారు. మున్ముందు రైతులు పెద్ద సంఖ్యలో రైతు నేస్తం కార్యక్రమంలో, పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా, అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా రైతుల్లో పంటలకు సంబంధించి అనేక అంశాలపై,అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మండల స్థాయి వ్యవసాయ అధికారులంతా తప్పనిసరి ప్రతిరోజు రైతుల మధ్య ఉండాలని చెప్పారు. మంత్రితో,నేరుగా ఆయా మండలాల నుంచి రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన పలువురు రైతులు మాట్లాడుతూ,వారు అవలంబించిన పంట మార్పిడి విధానాలు, పొందిన లబ్ధి వివరాలు పంచుకున్నారు.అలాగే పలువురు ఆదర్శ రైతులను మంత్రిలి సన్మానించారు.

# సినిమా న్యూస్

## పావలా శ్యామల కన్నుమూత




తెలుగు సినీ ఇండస్ట్రీలో తీవ్ర విషాదం నెలకొంది. పరిశ్రమలో గత రెండు దశాబ్దాలుగా తనదైన నటనతో ఎంతో మంది ప్రేక్షకులను అలరించి, నవ్వులు పూయించిన క్యారెక్టర్ ఆర్టిస్ట్, సీనియర్ నటి పావలా శ్యామల కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యం, వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1:52 గంటల సమయంలో ఆమెకు తీవ్రమైన గుండెపోటు (హార్ట్ ఎటాక్) రావడంతో తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి వైద్యులు అధికారికంగా ధ్రువీకరించారు.

ప్రస్తుతం ఆమె భౌతిక కాయాన్ని ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. కాగా, పావలా శ్యామల గత కొన్నేళ్లుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో జీవన పోరాటం సాగించారు. ఆమెతో పాటు ఉంటున్న కుమార్తె కూడా ప్రస్తుతం తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధ పడుతుండటంతో ఆ కుటుంబం దీనస్థితిలో ఉంది. ఒకప్పుడు వెండితెరపై విశేషంగా ఆకట్టుకున్న హాస్య నటి, చివరి రోజుల్లో ఇన్ని కష్టాలు అనుభవించి కన్నుమూయడం పట్ల టాలీవుడ్ చిత్ర పరిశ్రమ, ప్రముఖులు మరియు సినీ అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతిని, సానుభూతిని వ్యక్తం చేస్తున్నారు.

## ‘418’ రిలీజ్ వాయిదా

వరుస విజయాలతో దూసుకుపోతున్న ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న లేటెస్ట్ హారర్ థ్రిల్లర్ చిత్రం ‘418’. విభిన్నమైన కథాంశంతో రాబోతున్న ఈ సినిమా ద్వారా సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి మంచి గుర్తింపు పొందిన ప్రీతి పగడాల హీరోయిన్‌గా పరిచయం కాబోతున్నారు. అయితే ఈ సినిమాకు ప్రశాంత్ నీల్ సపోర్ట్ అందిస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి కీర్తన్ నాగగౌడ కథను అందించడంతో పాటు స్వయంగా దర్శకత్వ బాధ్యతలను కూడా వహిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాను జూలై 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు మూవీ మేకర్స్ ఇదివరకే అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఈ చిత్రం జూలై 31న విడుదల కావడం లేదని, విడుదల వాయిదా పడిందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా వ్యాప్తంగా వార్తలు వైరల్ అయ్యాయి.

ఈ వార్తలపై తాజాగా స్పందించిన చిత్ర నిర్మాణ సంస్థ ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ అసలు విషయాన్ని స్పష్టం చేసింది. “ఆ భయంకరమైన తలుపు మరికొద్ది రోజుల్లోనే తెరచుకోబోతోంది. అయితే, ‘418’ ఫిల్మ్‌ను జూలై 31న మాత్రం విడుదల చేయడం లేదు. ఇప్పటివరకు మీరు చూపించిన సహనానికి, మాపై కురిపిస్తున్న అపరిమితమైన ప్రేమకు ధన్యవాదాలు. మీరు అందిస్తున్న ఈ ప్రేమనంతటినీ త్వరలోనే మరింత భయంకరమైన భయం రూపంలో తిరిగి ఇచ్చేస్తామని మాటిస్తున్నాము. మీ ఈ నిరీక్షణకు ఖచ్చితంగా తగిన ఫలితం లభిస్తుంది. హారర్ సినిమాలను చూసి నవ్వడం చాలు, ఇక అసలైన భయాన్ని అనుభవిస్తూ భయపడాల్సిన సమయం వచ్చింది” అని రాసుకొచ్చారు. సినిమా కొత్త విడుదల తేదీకి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మూవీ మేకర్స్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన నోట్ వైరల్‌గా మారింది.




## ఓటీటీలోకి ‘రావు బహదూర్’

వైవిధ్యమైన పాత్రలతో నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సత్యదేవ్, దర్శకుడు వెంకటేష్ మహా కాంబినేషన్‌లో తెరకెక్కిన లేటెస్ట్ మూవీ ‘రావు బహదూర్’. ఈ సినిమాలో సత్యదేవ్ సరసన దీపా థామస్ హీరోయిన్‌గా నటించింది. సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రొడక్షన్ సంస్థ అయిన జిఎమ్‌బి ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో రూపుదిద్దుకున్న ఈ సైకాలాజికల్ డ్రామా చిత్రం, జూలై 3న ప్రపంచవ్యాప్తంగా చాలా ఘనంగా థియేటర్లలోకి వచ్చింది. సినిమా విడుదలకు ముందు వచ్చిన టీజర్, ట్రైలర్‌లు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని, భారీ అంచనాలను పెంచాయి. అయితే, థియేటర్లలో విడుదలైన తర్వాత ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని మాత్రం అందుకోలేకపోయింది.

అయినప్పటికీ, సినిమాలో సత్యదేవ్ కనబరిచిన నటన, దర్శకుడు వెంకటేష్ మహా మేకింగ్ స్టైల్, కథలోని ఇంటెన్సిటీకి సినీ విమర్శకులతో పాటు పలువురు సినీ సెలబ్రిటీల నుంచి విశేష ప్రశంసలు లభించాయి. ఇక థియేట్రికల్ రన్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రం డిజిటల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకోగా.. జూలై 31 నుంచి ఈ సినిమాను ఓటీటీ వేదికగా అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అయితే ఈ చిత్రాన్ని కేవలం తెలుగులోనే కాకుండా తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి స్ట్రీమింగ్ చేయనున్నారు. థియేటర్లలో ఈ విభిన్నమైన కథను చూడటం మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో చూడటానికి ఆసక్తి చూపిస్తున్నారు




## సంచలన స్కామ్ ఓటీటీలోకి!

కేవలం రూ.251కే స్మార్ట్‌ఫోన్ అందిస్తామంటూ ‘ఫ్రీడమ్ 251’ పేరుతో కొన్నేళ్ల క్రితం దేశవ్యాప్తంగా జరిగిన అతిపెద్ద డిజిటల్ స్కామ్ ఆధారంగా తెలుగులో ‘ఆజాదీ 501’ అనే వెబ్ సిరీస్ రాబోతుంది. రూ.20 వేలు సంపాదించే ఒక సాధారణ మధ్యతరగతి కుర్రాడు రూ.501కే ఫోన్ ఇస్తానని చెప్పే ఆలోచన, దాని వెనుక ఉన్న ఆశయాలు, ఆ తర్వాత చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు మరియు కార్పొరేట్ మోసం నేపథ్యంలో ఈ టెక్ డ్రామాను మేకర్స్ రూపొందించారు.





శివతేజ దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్‌లో తేజ కాకుమగడ్డ, హర్షవర్ధన్, గీతా భాస్కర్, శశాంక్, రవివర్మ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. థర్స్ డే సినిమాస్ బ్యానర్‌పై రచన రెడ్డి ములుముడి నిర్మించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ ట్రైలర్ ప్రేక్షకులలో అమితమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను జూలై 29 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ‘ఆహా’లో స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

## ‘వారణాసి’ కోసం కీరవాణి భారీ ప్లాన్!


సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ ‘వారణాసి’పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రతి అప్డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ వర్క్‌పై ఓ ఆసక్తికర చర్చ జరుగుతోంది. ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (రీ రికార్డింగ్) కోసం సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారనే వార్తలు వైరల్ అవుతున్నాయి. సాధారణంగా పెద్ద సినిమాలకు కూడా రెండు, మూడు నెలల్లో రీ రికార్డింగ్ పూర్తి చేసే కీరవాణి.. ‘వారణాసి’ కోసం ఏకంగా ఐదు నెలల సమయం తీసుకుంటున్నట్లు సమాచారం. అవసరమైతే ఆరు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిన సినిమాలకు కూడా తక్కువ సమయంలో బీజీఎం అందించే కీరవాణి.. ‘వారణాసి’ విషయంలో మరింత ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. రాజమౌళి-కీరవాణి కాంబినేషన్ తొలిసారి పాన్ వరల్డ్ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రాబోతుండటంతో మ్యూజిక్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ‘వారణాసి’ థీమ్ మ్యూజిక్‌తో కీరవాణి తన మార్క్ చూపించగా.. పూర్తి స్థాయి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం మరింత కేర్ తీసుకుంటున్నట్లు సమాచారం. మరోవైపు సినిమా షూటింగ్ అక్టోబర్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని, సెప్టెంబర్ నుంచి మ్యూజిక్ పనులు ప్రారంభించి జనవరి వరకు పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు కీరవాణి గతంలో వెల్లడించారు. అన్ని పనులు పూర్తి చేసుకుని ఈ చిత్రం 2027 ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం.



## ‘వధండి 2’తో శశికుమార్ ఎంట్రీ!

ఓటీటీ ప్రేక్షకులను చివరి వరకు ఉత్కంఠలో ముంచెత్తే క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌లకు ఎప్పుడూ మంచి ఆదరణ ఉంటుంది. అలాంటి సిరీస్‌లలో 2022లో విడుదలైన ‘వధండి’ ఒకటి. ఎస్.జె. సూర్య ప్రధాన పాత్రలో వచ్చిన ఈ వెబ్ సిరీస్ కథ, స్క్రీన్‌ప్లే, ట్విస్టులతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ సూపర్ హిట్ సిరీస్‌కు కొనసాగింపుగా ‘వధండి 2’ ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సిరీస్ స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించడంతో మరోసారి ఓటీటీ ప్రియుల్లో ఆసక్తి పెరిగింది. మొదటి భాగాన్ని ప్రముఖ దర్శక ద్వయం పుష్కర్, గాయత్రి నిర్మించగా, అదే బ్యానర్‌లో రెండో భాగం కూడా రూపొందింది. అయితే ఈసారి ఒక పెద్ద మార్పు చోటుచేసుకుంది. తొలి సీజన్‌లో ప్రధాన పాత్ర పోషించిన ఎస్.జె. సూర్య స్థానంలో ప్రముఖ నటుడు శశికుమార్ కథానాయకుడిగా కనిపించనున్నారు. దీంతో కొత్త కథతో పాటు కొత్త హీరో ఈ సిరీస్‌ను ఎలాంటి స్థాయికి తీసుకెళ్తాడన్న ఆసక్తి నెలకొంది.




ప్రైమ్ వీడియో అధికారిక ప్రకటన ప్రకారం ‘వధండి 2’ ఆగస్టు 7 నుంచి స్ట్రీమింగ్ ప్రారంభం కానుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి ఈ సిరీస్ ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. దక్షిణాది ప్రేక్షకులతో పాటు ఇతర భాషల ప్రేక్షకులను కూడా దృష్టిలో పెట్టుకుని ఈ సిరీస్‌ను విడుదల చేస్తున్నారు. ఈ సీజన్‌లో శశికుమార్‌తో పాటు యశ్వంత్, అనఘ మారుతోర, అపర్ణా దాస్, వివేక్ ప్రసన్న, రేవతి శర్మ, అర్జున్ నందకుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దర్శకుడు ఆండ్రూ లూయిస్ ఈ సీజన్‌కు దర్శకత్వం వహించారు. మొదటి భాగంలో కనిపించిన ఉత్కంఠను కొనసాగిస్తూ, మరింత ఇంటెన్స్ తో సాగే ఇన్వెస్టిగేషన్ కథను ఈసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. కథ విషయానికి వస్తే, మధురై శివార్లలోని ఒక నిర్జన ప్రాంతానికి బదిలీపై వెళ్లిన ఎస్ఐ మూసా రాజా చుట్టూ కథ తిరుగుతుంది. అక్కడ ఆయన ఒక పాత రాజకీయ కేసును ఛేదిస్తాడు. అయితే తన ఇన్వెస్టిగేషన్ ఫలితంగా ఒక అమాయకుడు జీవిత ఖైదు అనుభవిస్తున్నాడనే నిజం బయటపడుతుంది. ఆ తప్పును సరిదిద్దేందుకు రాజా మళ్లీ పాత కేసు తిరగదోడాల్సి వస్తుంది. నిజాన్ని వెలికితీసే ప్రయాణం ఈ సీజన్ ఉత్కంఠంగా ఉండబోతోంది. మొదటి భాగం సస్పెన్స్, ఎమోషన్, ఇన్వెస్టిగేషన్ అంశాలతో మంచి విజయాన్ని అందుకోవడంతో రెండో భాగంపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా శశికుమార్ కొత్త పాత్రలో ఎలా మెప్పిస్తారు, కథ ఎలాంటి మలుపులు తిరుగుతుంది, మొదటి సీజన్ విజయాన్ని కొనసాగిస్తుందా అనే ఆసక్తి ఓటీటీ ప్రేక్షకుల్లో కనిపిస్తోంది. క్రైమ్ థ్రిల్లర్‌లను ఇష్టపడే వారికి ‘వధండి 2’ ఆగస్టు నెలలో తప్పక చూడాల్సిన వెబ్ సిరీస్‌లలో ఒకటిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.